ఫలం దక్కింది. నీకు పెద్ద ఉద్యోగం వచ్చిందనే వార్త నిజంగా నాకు గొప్ప ఆనందాన్నే కలిగించింది. ఈ వార్తను ఇక్కడ ముఖ్యమైన స్నేహితులందరికీ చెప్పాను. వాళ్ళంతా నీకు తమ అభినందనలు తెలియజేయమని చెప్పారు- తరచు ఉత్తరాలు రాస్తూండు- నీ స్నేహితుడు - నిరంజన్.

మూడో ఉత్తరాన్ని లెక్చరర్ రంగారావు రాశాడు.

ప్రియమైన ప్రకాశం - నీ ఉత్తరం నాకెంతో సంతోషాన్ని కలిగించింది. అయితే నా మాట ఇప్పటికి నిజమయ్యిందన్నమాట. చదువులో నీ చురుకుదనం చూసి నువ్వు భవిష్యత్తులో ఇలాంటి పెద్ద ఉద్యోగస్తుడివి అవుతావని అప్పుడే వూహించగలిగాను. నీకు ఇక మంచి భవిష్యత్తుంది. జీవితంలో నువ్వింకా ఉన్నతస్థితికి చేరుకోవాలని కోరుకునే-మీ రంగారావు.

తర్వాత మిగిలిన మిత్రుల దగ్గర్నించి వచ్చిన ఉత్తరాలను కూడా చదివాడు ప్రకాశం. వాళ్ళుకూడా అతనికి అంత పెద్ద ఉద్యోగం వచ్చినందుకు సంతోషాన్ని, అసూయను వ్యక్తంచేస్తూ రాశారు.

ఆ ఉత్తరాలన్నింటినీ చదివిన ప్రకాశం చీకటి గుహలావున్న ఆ చిన్న గది మధ్యన నిలబడి "ఫూల్స్ .... ఇడియట్స్.... అంతా వట్టి వెధవలు" అని పెద్దగా నవ్వాడు.

యూనివర్సిటీ గోల్డుమెడల్ సంపాదించిన పోస్టుగ్రాడ్యుయేటుకి-డబ్బుతో ఉద్యోగం కొనలేని ఓ పేదవాడికి-ఎలాంటి సిఫార్సులు లేనివాడికి - ఈ దేశంలో నెలకు రెండు వేలు జీతంతో స్కూటరు, ఇల్లు, టెలిఫోన్ సౌకర్యాలు వున్న ఉద్యోగం వచ్చిందనిరాస్తే కనీసం ఒక్కడికికూడా ఇది అసంభవం అనే ఆలోచన రాలేదంటే అంతా వెధవలే అనుకుని పడిపడి నవ్వుకున్నాడు ప్రకాశం.

తర్వాత కొన్ని నిముషాల తర్వాత ఆ గదిలో ఓ మూలగావున్న వాల్ పోస్టర్లను, గమ్ బకెట్‌ను తీసుకుని గదికి తాళంపెట్టి బయల్దేరేడు. గోడలకు పోస్టర్లు అంటించటమే ఆ యూనివర్సిటీ గోల్డ్‌మెడలిస్టు ప్రస్తుత ఉద్యోగం.



# వ్యాపార రహస్యం

—చంద్రశేఖర ఆజాద్

సుబ్బారావు క్రొత్తగా వ్యాపారం ఆరంభించేడు.

షాపంతా ఆధునికంగా అలంకరించేడు. షాపులోని షోకేసులు కొంచెం ఖర్చు ఎక్కువయినా బాగా అందంగా తయారయ్యేయ్. వాటిలోకి సరుకులు చేరగానే మరింత అందంగా కనపడసాగాయ్. మంచిరోజు చూసి ప్రారంభోత్సవం ఘనంగానే చేయించేశాడు. ఆ సమయంలో విచ్చేసిన ఆహూతులందరికీ స్వీటూ హాటుల్తో పాటు కూల్ డ్రింక్స్ కూడా సేవింపచేశాడు. కొట్టు మంచి సెంటర్‌లో కాకున్నా ఓ మోస్తరు సెంటర్‌లోనే ఉంది.

సుబ్బారావు కొట్టుపేరుతో ఓ స్టాంప్ తయారు చేయించాడు. ఇంక్‌పాడ్

కొన్నాడు. ఓ లెటర్‌హెడ్ వేయించాడు. విజిటింగ్ కార్డులు వేయించేశాడు. క్యాష్ సొరుగుకు కూడా డెకొలాం వేయించి మరింత అందంగా మలిచాడు, చిల్లరకు గానూ నాలుగు తళతళలాడే గిన్నె లుంచాడు. క్యాష్ కోసం పెద్ద పెద్ద క్లిప్పులు కొనేశాడు. రాత్రికి మిగిలిన డబ్బును ఇంటికి తీసుకెళ్ళటానికి ఓ బ్రీఫ్‌కేసుకొన్నాడు. ఉదయం బ్యాంకులో వెయ్యటానికి ఓ కరెంట్ ఎకౌంట్ డ్రా చేసుకోవడానికి తనకు వీలుకాదేమో నని ఓ చెక్‌బుక్ ఏర్పాటు చేసుకొన్నాడు.

శుభోదయాన లేచి, శుభ్రంగా స్నానంచేసి, ఇస్త్రీబట్టలు వేసుకొని, తమ షాపుదగ్గర హోటల్‌లో టిఫిన్ చేసి, షాపుదగ్గరకొచ్చి తాళంచెవులు తీసి కుర్రాడికిచ్చేవాడు. వాడు షట్టర్ పైకెత్త గానే ఊడ్చించేవాడు.

నెలరోజులు గడినయి. లెక్కలు చూసుకుంటే వడ్డీకూడా గిట్టటంలేదని పించింది. తను షాపు ప్రారంభించిన ముహూర్తం మంచిది కాదేమోనని మరో ఆచార్యులగారిని కలిసి, తాను షాపు ప్రారంభించిన తేదీ వివరించి ఏమైనా దోషం ఉందేమో పరిశీలించమన్నాడు. అదేం లేదు దివ్యంగా ఉంది. కాకుంటే ప్రతీ శుక్రవారం....శనివారం పూజలు చెయ్యాలి నాయన అని చెప్పారు. అవిధం గానే తిరిగి కార్యక్రమం మొదలయింది. ఊహు! ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది.

* * *

ఓ రోజు సుబ్బారావు తన మనసు లోని బాధను తన మిత్రుడు రమణకు చెప్పాడు. రమణ షాపుదగ్గర కొచ్చాడు.

వాకిట్లోనే ఎదురయిందో బొమ్మ.

తీక్షణంగా చూస్తున్న బ్రహ్మరాక్షసుడు. నాలిక చాచి....కోరల్లాటి పళ్ళతో భయంకరంగా ఉన్నాడు.

"ఇదేమిటిరా" అన్నాడు రమణ

"దిష్టిబొమ్మ".

"ఎందుకు?"

"ఎందుకేమిటిరా. నరుడి చూపబడితే నాశనం కానిదంటూ ఏముంది.కొట్టుచూసి దిష్టికొట్టకుండా ఏర్పాటుచేశాను. వీటిలో మామూలు కాయితం బొమ్మలు కూడా ఉన్నాయి. గ్రాండ్‌గా ఉండాలని పర్మనెంటుగా స్టీలుది కొనేశాను" గొప్పగా చెప్పాడు సుబ్బారావు.

రమణ కొట్టంతా పరిశీలించాడు.

"నీ వ్యాపారం ఎందుకు సక్సెస్ కాలేదో ఇప్పుడర్థమయిందిరా" అన్నాడు.

"ఎందుకో చెప్పు".

"నీలో వ్యాపారస్థుడి లక్షణాలు లేవు. ఆడంబరాలతో వ్యాపారం మొదలెట్టావు. వ్యాపారంకంటే మిగతా విషయాలమీద నీకు అసక్తి కనబడుతోంది. ముఖ్యంగా








ఆ వాకిట్లో రాక్షసుడున్నాడు చూశావ్.... నిన్ను ముంచేది వాడే".

"ఆదేమిటిరా"

"లేకపోతే ఏమిటిరా. లోనికొచ్చేవాడ్ని తినేట్టు చూస్తుంటే ఎవడొస్తాడు? నాక యితే యిందాకే వెళదామనుకున్నా. చిన్న పిల్లలయితే ఆ బొమ్మచూసి దడుసుకొని రారు. చదువుకున్నవారయితే నీ వ్యాపారానికి దిష్టెందుకు కొట్టాలని వేరే షాపుకు వెళతారు."

సుబ్బారావుకు నోటంట మాటరాలేదు.

"నీ కింకో రహస్యం తెలుసా?"

ఏమిటన్నట్టు చూశాడు సుబ్బారావు.

"రెండు మూడేళ్ళక్రితం ఇలాంటివి కాయితాలమీద ప్రింటుచేసి అమ్మేవాళ్లు. నీలాంటివాళ్ళ పుణ్యమా అంటూ వాడి వ్యాపారం స్టీలు రాక్షసుడివరకు ఎది గింది" అన్నాడు రమణ.

సుబ్బారావు తెల్లబోయి చూస్తున్నాడు.

"వ్యాపారం పెరగాలంటే కావలసింది జనం దిష్టికొట్టకుండా ఉండటం కాదు. జనాని కేంకావాలో తెలుసుకోవటం" అన్నాడు రమణ గొప్ప తాత్వికవేత్త భంగిమలో.

సుబ్బారావుని రాక్షసుడు తినేటట్లు చూస్తున్నాడు.